ఇందిరాగాంధీ విగ్రహ ధ్వంసం పై కాంగ్రెస్ ఆగ్రహం

- ఇంద్రచౌక్‌లో విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన.
- నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు.
- పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు. ఘటన పై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్ నాయకులు.


2లో

తెహెల్కా

ప్రతి వార్త సంచలనం





నిజామాబాద్ కామారెడ్డి

గురువారం 5 నవంబర్ 2026 పేజీలు : 4

పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానం.. అధికారుల నిర్లక్ష్యం పై ఆగ్రహం

- చెత్తకుప్పల్లో కూర్చుని 46వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మినారాయణ వినూత్న నిరసన.
- ఎక్కడపడితే అక్కడ పేరుకుపోతున్న చెత్త. దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు.
- నిరసనతో సుభాష్ రోడ్డులో తొలగింపు.. జీజీహెచ్ వద్ద యథాతథం. - మిగతా2లో



తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు కీలక నిర్ణయాలు



- డిసెంబర్ 11 నుంచి 22 వరకు జాతీయ పోటీలు.. 28 క్రీడాంశాల్లో పోటీలు.
- హైదరాబాద్‌తో పాటు ఆరు ప్రధాన నగరాల్లో పోటీలు.
- దేశవ్యాప్తంగా 7 వేల మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌ల రాక.
- అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ ఎం. జైపాల్‌రెడ్డి.

కామారెడ్డి, నవంబరు 4 (తెహెల్కా న్యూస్)

తెలంగాణలో డిసెంబరు 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా-2026 జాతీయ క్రీడలను విజయవంతం చేసేందుకు తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. క్రీడలను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రం లోని వివిధ ప్రాంతాలకు విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్‌తో పాటు హనుమకొండ, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ నగరాల్లోనూ పోటీలు నిర్వహించనున్నారు. -2లో

పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానం.. అధికారుల నిర్లక్ష్యం పై ఆగ్రహం

కామారెడ్డి, నవంబరు 4 (తెహెల్కా న్యూస్)

కామారెడ్డి పట్టణంలో రోజుల తరబడి చెత్తను తొలగించక పోవడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. దోమలు, ఈగల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చాలని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వీధులు, ప్రధాన రహదారులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకు పోతున్నాయి.ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో 46వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మీనారాయణ వినూత్న నిరసనకు దిగారు. తన వార్డులో పేరుకుపోయిన చెత్తకుప్పల్లోనే కూర్చుని అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి పట్టణాన్ని





మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని మండిపడ్డారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోతే ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కదిలిన యంత్రాంగం

కౌన్సిలర్ నిరసనతో స్పందించిన మున్సిపల్ సిబ్బంది సుభాష్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అయితే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) సమీపంలో మాత్రం చెత్తకుప్పలు అలాగే ఉండిపోయాయి. ఒకచోట చెత్త తొలగించి మరోచోట పదిలేయడం పై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులు నిరసనలు, ఫిర్యాదులకు పరిమితం కాకుండా నిరంతరం కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల పరిసరాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి వార్డులో చెత్త సేకరణకు పక్కా కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరుతున్నారు.

తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు కీలక నిర్ణయాలు

కామారెడ్డి, నవంబరు 4 (తెహెల్కా న్యూస్)

తెలంగాణలో డిసెంబరు 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా–2026 జాతీయ క్రీడలను విజయవంతం చేసేందుకు తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. క్రీడలను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించాలని నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్‌తో పాటు హనుమకొండ, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ నగరాల్లోనూ పోటీలు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఒలింపిక్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు, మాజీ ఎంపీ ఎ.పి. జితేందర్ రెడ్డి అధ్యక్షతన అడ్వైజరీ కమిటీ సమావేశం



నిర్వహించారు. మొత్తం 28 క్రీడాంశాల్లో జరగనున్న ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 7 వేల మందికి పైగా క్రీడాకారులు, విద్యార్థులు, కోచ్‌లు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వసతి, భోజనం, రవాణా వసతి, భోజనం, రవాణా తదితర సదుపాయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో కల్పించాలని సభ్యులు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ మెగా క్రీడా సంబరాల ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జితేందర్‌రెడ్డి పిలుపు నిచ్చారు.

అడ్వైజరీ కమిటీలో అథ్లెటిక్స్ అధ్యక్షుడు ఎం. జైపాల్‌రెడ్డి

అడ్వైజరీ కమిటీ నూతన సభ్యుడిగా ఎన్నికైన కామారెడ్డి జిల్లాకు చెందిన ప్రముఖ విద్యావేత్త,అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం. జైపాల్‌రెడ్డి సమావేశంలో పాల్గొని తన సూచనలు అందించారు. సమావేశం అనంతరం కమిటీ ప్రతినిధులురాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిని కలిసి క్రీడల నిర్వహణ పై సలహాలు, సూచనలు స్వీకరించారు. తెలంగాణకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చేలా పోటీలను విజయవంతం చేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు.

ఇందిరాగాంధీ విగ్రహ ధ్వంసం పై కాంగ్రెస్ ఆగ్రహం

కామారెడ్డి, నవంబరు 4 (తెహెల్కా న్యూస్)

కామారెడ్డి పట్టణంలోని ఇంద్రచౌక్ వద్ద ఏర్పాటు చేసిన మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరాగాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేయడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తిని వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. విగ్రహ ధ్వంసం ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నిరసన తెలిపారు. దేశ ప్రధానిగా సేవలందించిన ఇందిరాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజల మనోభావాలను దెబ్బ తీయడమే కాకుండా సమాజంలో అశాంతికి కారణమవుతాయని అన్నారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని పోలీసులు వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు



తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విగ్రహాల వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై న్యాయం జరిగే వరకు పోరాడుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కౌన్సిలర్లు షేరు, జావిద్, ఇప్ప శ్రీనివాస్, లడ్డు, సిద్ధిక్, అజ్మత్, ఖదీర్, విజయ్, చాట్ల రాజేశ్వర్, కాళ్ల గణేష్, సిరాజ్, లక్కపతిని గంగాధర్, రామ్మోహన్, సంతోష్, సుధాకర్‌రెడ్డి, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంట

– జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి



కామారెడ్డి, నవంబర్ 4 (తెహెల్కా న్యూస్)

కామారెడ్డి జిల్లా అంబర్‌పేట్ గ్రామానికి చెందిన రైతు శ్రీ ప్రవీణ్ రావు గారి ఆయిల్ పామ్ తోటను సందర్శించి, ఆయిల్ పామ్ సాగు విధానం, పంట దిగుబడి, ఆదాయం మరియు ప్రభుత్వ రాయితీల పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు శ్రీ ప్రవీణ్ రావు మాట్లాడుతూ, తాను గత నాలుగు సంవత్సరాలుగా ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నానని, ప్రస్తుతం పంట దిగుబడి ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 10 సార్లు గెలల కోత (కట్టింగ్) చేపట్టి, సుమారు 10 టన్నుల ఆయిల్ పామ్ గెలలను దిగుబడిగా పొందినట్లు వెల్లడించారు. దీని ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.2,50,000 ఆదాయం లభించిందని, తక్కువ సమయంలోనే మంచి ఆదాయం రావడంతో తాను ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపారు. ఆయిల్ పామ్ పంట దీర్ఘకాలికంగా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే పంట అని తన అనుభవాన్ని ఇతర రైతులతో పంచుకున్నారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, ఎల్‌నినో ప్రభావం మరియు నీటి లభ్యతలో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ సాగును ఒక ప్రత్యామ్నాయ వాణిజ్య పంటగా పరిశీలించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను కూడా ప్రభుత్వ రాయితీపై అందించడం జరుగుతుందని, కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు ముందుకు రావాలని రైతు ప్రవీణ్ రావు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి శ్రీమతి జ్యోతి గారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు పలు రకాల రాయితీలు మరియు ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఒక ఎకరానికి సంవత్సరానికి రూ.4,200 చొప్పున నిర్వహణ ఖర్చుల నిమిత్తం రాయితీ అందించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై కూడా అర్హత మేరకు రాయితీ కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ పంట ఒకసారి నాటిన తరువాత దీర్ఘకాలం పాటు దిగుబడిని అందించే పంట అని, రైతులకు నిరంతర ఆదాయ అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేయదలచిన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి సాగు విధానం, మొక్కల లభ్యత, రాయితీలు మరియు ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాలపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి శ్రీమతి జ్యోతి, కామారెడ్డి ఉద్యాన అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ మేనేజర్ చంద్రబాబు, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్,ఆయిల్ పామ్ సిబ్బంది హిమ కుమార్, అరుణ్, శివ, సత్యనారాయణ, కిరణ్, అంబర్‌పేట్ గ్రామ సర్పంచ్, అంబర్‌పేట్ మరియు దోమకొండ ఏఈవో లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక రాతి చిత్రాలను పరిరక్షించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

- సందర్శకులు సులభంగా వీక్షించేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి, నవంబర్ 4 (తెహెల్కా న్యూస్)

కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం ఎల్లమ్మతండా సమీపంలోని ఖందకాల ప్రాంతంలో ఉన్న చారిత్రక రాతి చిత్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాతిపై చిత్రించిన ప్రాచీన చిత్రాలను స్వయంగా వీక్షించి, వాటి ప్రత్యేకతలు, చారిత్రక ప్రాధాన్యతను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలోని రాతిపై వీబీ--జీ రామ్ జీ అనే అక్షరాలు రాసి ఉండటాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఈ ప్రాంతం ప్రధాన రహదారికి సమీపంలో ఉండటంతో పర్యాటకులు సులభంగా చేరుకుని చారిత్రక రాతి చిత్రాలను వీక్షించేందుకు అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చారిత్రక వారసత్వ సంపదను భావితరాలకు అందించేలా పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. రాతి చిత్రాల చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని, సందర్శకులు సులభంగా వీక్షించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని ఆకర్షణీయమైన చారిత్రక పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓకు సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేందర్, మండల రెవెన్యూ అధికారి, ఎంపీడీఓ ప్రవీణ్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో ఓ నెగిటివ్ రక్తాన్ని అందజేత

- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు

కామారెడ్డి, నవంబర్ 4 (తెహెల్కా న్యూస్)



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు వైద్యశాలలో లక్ష్మి (32) అనే మహిళకు ఆపరేషన్ నిమిత్తమై ఓ నెగటివ్ రక్తం అవసరం కావడంతో వారికి కావాల్సిన రక్తాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయులు పర్వ వెంకటరమణ సకాలంలో అందజేసి ప్రాణ దాతగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడు తూ., ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులను నిర్వహిస్తూనే సామాజిక బాధ్యతగా పర్వ వెంకటరమణ,వారి కుమారులు మృణాల్, తృషాల్ ప్రతి సంవత్సరం మూడు నుండి నాలుగు సార్లు రక్తదానం చేయడమే కాకుండా డెంగ్యూ బాధితులకు క్యాన్సర్ బాధితులకు ప్లేట్ లెట్స్ ఆదర్శంగా నిలవడం జరిగిందని అన్నారు. ఎన్ని డబ్బులు ఉన్నా సకాలంలో రక్తాన్ని ఇచ్చేవారు లేకపోతే ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెరిగి రక్తదానానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.తల సేమియా బాధిత చిన్నారుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహి స్తామని అన్నారు. ప్రతి సంవత్సరం మూడు నుండి నాలుగు సార్లు రక్తదానం చేసే రక్తదాతలకు అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని రక్తదాతలను అభినందించాల్సిన బాధ్యత నేటి సమాజం పై ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రక్తదాతకు కృతజ్ఞతలను తెలియజేశారు.

బీబీపేట పీఏసీఎస్ నిర్మాణాలకు 7ఎకరాల స్థలం కేటాయింపు





- గ్రామపంచాయతీ తీర్మానంతో యాదారం గ్రామస్థుల ఉదారత.
- కోనాపూర్ శివారులో 7 ఎకరాల 12 గుంటల భూమి కేటాయింపు.
- రైస్‌మిల్లు, గోదాం నిర్మాణాలకు స్థలం కేటాయింపు.
- గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపిన పీఏసీఎస్ చైర్మన్ సుతారి రమేశ్.

కామారెడ్డి, నవంబరు 3 (తెహెల్కా న్యూస్)

రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బీబీపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అభివృద్ధికి యాదారం గ్రామస్థులు ముందుకొచ్చారు. సంఘం ఆధ్వర్యంలో రైస్‌మిల్లు, గోదాం నిర్మాణాల చేపట్టేందుకు గ్రామానికి చెందిన ప్రభుత్వ భూమిని కేటాయించారు. బీబీపేట మండలం యాదారం గ్రామ పరిధిలోని కోనాపూర్ శివారులో సర్వే నంబరు 822లో ఉన్న 7 ఎకరాల 12 గుంటల స్థలాన్ని గ్రామపంచాయతీ తీర్మానం ద్వారా పీఏసీఎస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యాదారం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ప్రభుత్వ స్థలాన్ని పీఏసీఎస్ చైర్మన్ సుతారి రమేశ్‌కు రైస్‌మిల్లు, గోదాం నిర్మాణాల కోసం గ్రామం తరపున కేటాయించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి, రైతుల ప్రయోజనాలకు ఉపయోగపడే ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పీఏసీఎస్ చైర్మన్ సుతారి రమేశ్ మాట్లాడుతూ., అడిగిన వెంటనే స్థలాన్ని కేటాయించేందుకు అంగీకరించిన సర్పంచ్, గ్రామస్థులకు మండల రైతులు, ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ స్థలంలో రైస్‌మిల్లు, గోదాం నిర్మాణాలు చేపట్టడం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలుగు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు పార్నగౌడ్, గోపాలరావు, మాజీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఏంసీ చైర్మన్ రాజు, బీబీపేట ఉపసర్పంచ్ ప్రశాంత్‌కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు భూమగౌడ్, సాయినాథ్‌తో పాటు యాదారం గ్రామస్థులు పాల్గొన్నారు.

'మీ డబ్బు - మీ క్లిక్ - మీ ఎంపిక' అప్రమత్తతే రక్షణ





- ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన.
- ఆన్‌లైన్ పెట్టుబడులు, సైబర్ మోసాలపై హెచ్చరిక, అనుమానాస్పద లింకులతో జాగ్రత్త.
- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి.

కామారెడ్డి, నవంబరు 4 (తెహెల్కా న్యూస్)

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తం గా ఉండటమే వాటి నుంచి రక్షణ పొందేం దుకు తొలి మార్గమని పోలీసులు సూచించారు .ముఖ్యంగా విద్యార్థులు, ఉపాధ్యా యులు ఆన్‌లైన్ లావాదేవీలు, సామాజిక మాధ్యమాల వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. సైబర్ జాగరూకత దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సదాశివనగర్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో సీఐ వీరయ్య, డీ4సీ ఎస్ఐ నరేష్

సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, డీ4సీ ఎస్ఐ నరేష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'మీ డబ్బు-మీ క్లిక్-మీ ఎంపిక' అనే నినాదంతో సైబర్ మోసాల తీరును వివరించారు. ఆన్‌లైన్ ప్రకటనల ద్వారా ఆకర్షించి డబ్బులు కాజేయడం, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలను దొంగిలించడం, షేర్ల మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయం టూ పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడటం వంటి విధానాలను వివరించారు.

అప్రమత్తతే రక్షణ..

గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని పోలీసులు సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, ఓటీపీని ఇతరుల తో పంచుకోవద్దని స్పష్టం చేశారు. అను మానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ పెట్టుబడి ప్రతి పాదనల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యాశకు పోయి తెలియని వ్యక్తుల సూచనలతో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా నష్టపోవద్దని హెచ్చరించారు.

మోసానికి గురైతే వెంటనే ఫిర్యాదు

సైబర్ ఆర్థిక మోసానికి గురైన వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచిం చారు. అలాగే జాతీయ సైబర్ క్రైమ్ ఫిర్యాదుల వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సకాలంలో ఫిర్యాదు చేయడం వల్ల మోసపోయిన సొమ్మును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సీఐ వీరయ్య, డీ4సీ ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సైబర్ నేరాల పై అవగాహన పెంచుకుని వ్యక్తిగత సమాచారం,ఆర్థిక లావాదేవీల భద్రత కు ప్రాధాన్యమివ్వాలని పోలీసులు పిలుపు నిచ్చారు.

ఆదర్శ గ్రామంగా లింగంపల్లి కుర్దును తీర్చిదిద్దాలి









- నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగు పై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

- ఉపాధి హామీ పనుల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం.

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 4 (తెహెల్కా న్యూస్)

జిల్లాలోని గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంతో పాటు, నీటి సంరక్షణ చర్యల ను విస్తృతంగా చేపట్టి పర్యావరణ పరిరక్షణ లో ఆదర్శంగా నిలపాలన్నదే జిల్లా యంత్రా ంగం లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం లింగంపేట మండలంలోని లింగంపల్లి కుర్దు గ్రామంలో పర్యటించి, గ్రామంలో చేపడుతున్న ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలు, నీటి సంరక్షణ నిర్మాణాలు, పారిశుద్ధ్య పనులు, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో గ్రామస్థులు, రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే తడకల్ గ్రామంలోని ఎండ్రియాల్, దోమకొండ మండలంలోని గోటిముక్కల గ్రామాల్లో ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యక్రమాలు చేపట్టామని, తాజాగా లింగంపల్లి కుర్దు గ్రామాన్ని మూడో ప్లాస్టిక్ రహిత గ్రామంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, పర్యావరణ హిత ఇటుకల తయారీ, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

గ్రామంలో నీటి సంరక్షణ, పారిశుద్ధ్య పనుల పరిశీలన

గ్రామంలో పర్యటించిన కలెక్టర్ పైకప్పుల పై పడే వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు, ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తతో పాటు నాలుగు రకాల చెత్తను వేర్వేరుగా సేకరించే విధానం, మురుగునీటి కాలువల వ్యవస్థ, ప్రతి ఇంటి వద్ద, సామూహికంగా నిర్మిస్తున్న ఇంకుడు గుంతలు, బోరుబావుల పునరు ద్ధరణ, భూగర్భ జలాల పెంపునకు చేపడు తున్న నిర్మాణాలను పరిశీలించారు. ప్రతి ఇంటి వద్ద నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాలను పెంపొంది ంచాలని సూచించారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా ప్రతి గ్రామం లో ఇంకుడు గుంతలు, బోరుబావుల పునరు ద్ధరణ, పైకప్పులపై పడే వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. లింగం పల్లి కుర్దు గ్రామంలో 1.2 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల లోతుతో నిర్మించే ఇంకుడు గుంతకు సుమారు రూ.6,500 అంచనా వ్యయం అవుతుందని వివరించారు.

ఉపాధి హామీ పనుల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం

గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్థులు ఉపాధి హామీ పనుల్లో అధిక సంఖ్యలో పాల్గొనడం, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణను సమర్థవంతంగా నిర్వహి ంచడం పట్ల అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నీటి సంరక్షణ, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ పనుల ను ప్రజలందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొన సాగించాలని, ప్రతి కుటుంబం ఈ కార్య క్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే కాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు రాబోయే రబీ సీజన్‌లో వరి సాగుపైనే ఆధారపడకుండా జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచు కుని పంటలను ఎంపిక చేసుకోవాలని, సాగులో తగిన జాగ్రత్తలు పాటించి నష్టాలు రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవ సాయం చేయాలని తెలిపారు. కూరగాయల సాగు, ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని వివరించారు. జిల్లాలో జొన్నల సాగుకు అవసరమైన విత్తనాల పరిమితిని 8 క్వింటాళ్లకు పెంచా లని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక సమర్పి ంచాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌ ను ఆదేశించారు.

విద్యార్థుల ప్రదర్శనలను అభినందించిన కలెక్టర్

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, ప్లాస్టిక్ విని యోగం వల్ల కలిగే నష్టాలు, నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్య రూపకాలు, పాటలను కలెక్టర్ తిలకించారు. విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చా రని అభినందిస్తూ, చిన్న వయస్సు నుంచే పర్యావరణ పరిరక్షణ పై అవగాహన పెంపొందించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.

చెరువుకట్ట పై మొక్కల పెంపకం, సౌర విద్యుత్‌కు చర్యలు

అనంతరం గ్రామ చెరువుకట్టను పరిశీ లించి, కట్ట పై మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. చెరువుకట్ట పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దాలని, నాటిన మొక్కల ను సంరక్షించే బాధ్యతను గ్రామస్థులు తీసు కోవాలని సూచించారు. చెరువుకట్ట ఆవరణ లో సౌర విద్యుత్ ఏర్పాటు చేసే అవకాశాల ను పరిశీలించి, సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భం గా మొక్క నాటి, సౌర విద్యుత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ఆదర్శ గ్రామాల నిర్మాణం

గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువత, విద్యార్థులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, తడి, పొడి చెత్తను వేరు చేయడం, నీటిని పొదుపుగా వినియోగించడం, పర్యావరణాన్ని పరిరక్షిం చడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై.గిరి, డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సురేందర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, సర్పంచ్ ప్రత్యూష సాయిరాం, ఉపసర్పంచ్ కుమ్మరి సంతోష్ కుమార్, తహసీల్దార్, ఎంపీడీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు, రైతులు, విద్యార్థు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మహిళా సంఘాల బలోపేతానికి, రైతుల ధాన్య నిల్వకు నూతన భవనాలు ఎంతో ఉపయోగకరం

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్





కామారెడ్డి, నవంబర్ 4 (తెహెల్కా న్యూస్)

గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని సూచించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని రైతునగర్ గ్రామంలో వివిజి రామ్ పథకం కింద రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామైక్య సంఘం భవనాన్ని, రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన ధాన్య నిల్వ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సాధికారత కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి గ్రామైక్య సంఘం భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళలు సంఘటితంగా పనిచేస్తూ ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. బాన్సువాడ నియోజక వర్గం వరి ధాన్యం ఉత్పత్తిలో ముందంజలో ఉందని, బాన్సువాడ ,బీర్కూర్, నస్రుల్లాబాద్ తదితర మండలాల్లో రైతులు పెద్ద ఎత్తున వరి సాగు చేస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోనే ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు నిర్మించిన కేంద్రం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకోవడంతో పాటు, రైతులు మిల్లులు, దళారుల పై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు. బాన్సువాడ శాసనసభ్యులు, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో రైతునగర్ గ్రామం ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చెందడం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్య క్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే, కళ్యాణ మండపానికి అనుబంధ భవన నిర్మాణానికి సహకారం అందించిన దాత నాగేశ్వరరావు సేవలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.గ్రామ అభివృద్ధి కి దాతలు, ప్రజలు అందించే సహకారం ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అగ్రోస్ చైర్మన్, అర్డీఓ, స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు,పంచాయతీ సిబ్బంది,మహిళా స్వయం సహాయక సంఘాలసభ్యులు,రైతులు,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.